

## కులగణనతో రేషన్‌కార్డుకు లింకా?

మొదటిపేజీ తరువాయి...

అర్హత లేని ప్రైవేటు వ్యక్తులతో సర్వే చేయించారని విమర్శలున్నాయి. ప్రజల నుంచి సేకరించిన వివరాలతో కూడిన ఫారాలు రోడ్లపై దర్శనమిచ్చాయి. కులగణనలో పాల్గొనాలని, వివరాలు ఇవ్వాలన్న ప్రభుత్వ పెద్దలు మాత్రం సర్వేకు దూరంగా ఉన్నట్టు తెలిసింది. చాలా మంది మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, కీలక నేతలు కూడా సర్వేలో పాల్గొనలేదని ప్రచారం జరిగింది. ఈ సర్వేకు ప్రామాణికత ఎక్కడిదని ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### సర్వేలో పాల్గొనకపోతే ఎలా?

కులగణన సర్వేలో చాలా మంది ప్రజలు పాల్గొనలేదు. ఉపాధి, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారు వివరాలను ఇవ్వలేదు. కానీ ప్రభుత్వం మాత్రం కులగణన సర్వేతో రేషన్‌కార్డులకు లింక్ పెట్టిన మేరకు, రేషన్‌కార్డులకు అర్హతలున్నప్పటికీ సర్వేలో పాల్గొనని వారి పరిస్థితి ఏమిటని ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

### దరఖాస్తు విధానం రద్దు ఎందుకు?

కొత్త రేషన్‌కార్డుల జారీకి ఇప్పటి వరకు అనుసరించిన దరఖాస్తు విధానాన్ని ప్రభుత్వం ఎత్తివేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అర్హులైన వారికి కూడా రేషన్‌కార్డులు వచ్చే అవకాశం పోతుందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం వద్ద ఉన్న వివరాల ఆధారంగానే కొత్త కార్డులు జారీ చేయడమేంటని ప్రజలు అభ్యంతరం చెబుతున్నారు. ఒకవేళ సర్వేలో తప్పులు దొర్లితే అర్హులైన ఎందరో రేషన్‌కార్డు మంజూరయ్యే అవకాశం పోతుంది. ఈ నేపథ్యంలో కులగణన సర్వే ఆధారంగా కొత్త రేషన్‌కార్డుల జారీ సరికాదని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# పాలకులు మారగానే కేసా?

- ఒక్క రూపాయి చెల్లించనప్పుడు పీసీ యాక్ట్ 13(1)(ఏ) ఎలా పెడతారు?
- అభియోగాలన్నీ నిజమైనా ఆ సెక్షన్ వర్తించదు
- డబ్బులు చెల్లించినవారిపై, తీసుకున్నవారిపై కేసే లేదు
- విధాన, చట్టపర లోపాలుంటే ప్రభుత్వం సరిచేసుకోవాలి
- ఇదొక రాజకీయ కుట్ర.. కేటీఆర్‌పై ఏసీబీ కేసు చెల్లదు
- సుప్రీంకోర్టులో సీనియర్ న్యాయవాది సుందరం వాదన
- కేసు ఉపసంహరణకు సుప్రీంకోర్టు అనుమతి



హైదరాబాద్, జనవరి 15(నమస్తే తెలంగాణ): ఫార్ములా-ఈ రేసుపై ఏసీబీ నమోదు చేసిన ఎఫ్‌ఐఆర్‌ను కొట్టివేయాలన్న అభ్యర్థనపై బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌పై హైకోర్టు ఇచ్చిన తీర్పులో జోక్యం చేసుకోవడానికి సుప్రీంకోర్టు నిరాకరించింది. అప్పీల్ పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతి ఇవ్వాలని కేటీఆర్ తరపు న్యాయవాది చేసిన అభ్యర్థనను సుప్రీంకోర్టు ధర్మాసనం ఆమోదించింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ ప్రసన్న బీ వరాలేతో కూడిన ద్విసభ్య ధర్మాసనం బుధవారం తుది ఉత్తర్వులు జారీచేసింది.

### కుట్రలో భాగంగానే పీసీ యాక్ట్ సెక్షన్ 13(1)(ఏ) నమోదు

తొలుత కేటీఆర్ తరపు సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, సిద్ధార్థ దవే వాదించారు. సుందరం వాదిస్తూ.. తెలంగాణ ప్రభుత్వం కక్షపూరితంగా, రాజకీయ దురుద్దేశంతో, ఏకపక్షంగా ఫార్ములా-ఈ రేసులో అక్రమాలు జరిగాయంటూ ఏసీబీ ద్వారా కేసు నమోదు చేయించిందని ఆరోపించారు. నిధుల దుర్వినియోగమే లేనప్పుడు అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్ 13(1)(ఏ) కింద కేసు నమోదు చేయడమేంటని వాదించారు. హైదరాబాద్ కీర్తి ప్రతిష్టలను విశ్వవ్యాప్తం చేసే క్రమంలో ఆ నాటి మంత్రి హోదాలో కేటీఆర్ ఫార్ములా-ఈ రేసును నిర్వహించాలని నిర్ణయం తీసుకున్న తర్వాత ఒక్క రూపాయి కూడా కేటీఆర్‌కు చెల్లించనప్పుడు ఆ సెక్షన్ కింద ఏసీబీ ఎఫ్‌ఐఆర్ ఎలా చెల్లుతుందని ప్రశ్నించారు. ఒక్క నయాపైసా లావాదేవీలతో పిటిషనర్‌కు సంబంధం లేనప్పుడు అవినీతి జరిగిపోయిందంటూ ముందే ఒక నిర్ణయానికి ఎలా వస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వం చెప్పినట్టుగా అభియోగాలన్నీ కాసేపు నిజమైనవని అనుకుంటే, నిధులు పొందిన సంస్థను గానీ, ఒప్పందం చేసుకున్న హెచ్‌ఎండీఏను గానీ నిందితులుగా ఎందుకు చేర్చలేదని ప్రశ్నించారు. విదేశీ సంస్థకు నిధుల చెల్లింపులు, ఆర్థిక శాఖ అనుమతి లేకుండా రూ.54 కోట్ల చెల్లింపులు జరిగాయనే అభియోగానికి, సదరు 13(1)(ఏ)సెక్షన్‌కు ఏవిధంగా సంబంధమో అర్థం కావడం లేదని పేర్కొన్నారు.

### అన్నీ ప్రభుత్వం వద్దే ఉన్నాయి కదా!

ఒప్పంద పత్రాలు, నిధుల చెల్లింపు లావాదేవీల పత్రాలు కూడా ప్రభుత్వం వద్దే ఉన్నాయని, ఈ నిర్ణయంలో లోపాలు, తప్పులు ఉంటే వాటిని ప్రభుత్వమే సరిచేయాలన్న విషయాన్ని గాలికి వదిలేసి ప్రతిపక్ష నాయకుడిపై కక్ష సాధింపులతో కేసు బనాయిస్తే ఎలా? అని ఆర్యమ సుందరం ప్రశ్నించారు. ఫార్ములా- ఈ రేసు నిర్వహణ వల్ల ప్రభుతానికి రూ.700 కోట్ల మేరకు లబ్ధి చేకూరిన విషయాన్ని ప్రభుత్వం పట్టించుకోకపోవడాన్ని తప్పుపట్టారు. పీసీ యాక్ట్ సెక్షన్ 13(1),(ఏ) కింద కేసు పెట్టడానికి నేరపూరిత ప్రవర్తన పిటిషనర్‌పై ఎక్కడా లేదని చెప్పారు. ఒక్క ఆధారం కూడా ఏసీబీ దగ్గర లేకపోయినప్పటికీ, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న కేటీఆర్‌ను ఇబ్బందులకు గురిచేయాలన్న దురుద్దేశం కనబడుతున్నదని తెలిపారు. హైకోర్టు క్వాష్ పిటిషన్‌ను కొట్టివేయడం అన్యాయమని, హైకోర్టు తీర్పును రద్దు చేయాలని కోరారు. స్పాన్సర్స్ వెళ్లిపోవడంతో ప్రభుత్వానికి ఆర్థికంగా నష్టం రాకూడదనే ఆనాటి మంత్రి హోదాలో పిటిషనర్ కేటీఆర్ చొరవ తీసుకుని ఫార్ములా- ఈ రేసు కొనసాగేలా చేయడమే నేరమా? అని ప్రశ్నించారు. లేని అవినీతి ఉన్నదంటూ వర్తించని 13(1)(ఏ) సెక్షన్ కింద కేసు నమోదు చేయడాన్నే ప్రశ్నిస్తున్నామని స్పష్టంచేశారు.

### తీరుబడిగా కేసు.. ఆగమేఘాలపై నమోదు

లీలావతి, పరంజీత్‌సింగ్ కేసుల్లో సుప్రీంకోర్టు జారీచేసిన తీర్పులకు విరుద్ధంగా ఫార్ములా- ఈ రేసులో తీవ్ర జాప్యంతో ఏసీబీ కేసు నమోదుచేసిందని ఆర్యమ సుందరం వాదించారు. గత డిసెంబర్ 18న సాయంత్రం 5.30 గంటలకు ఫిర్యాదు అందితే, ఆ మరుసటి రోజునే ఏసీబీ ఎఫ్‌ఐఆర్ నమోదుచేయడం చెల్లదని పేర్కొన్నారు. ఫిర్యాదు అందిన తరువాత ఎలాంటి దర్యాప్తు చేయకుండానే ఆగమేఘాలపై కేసు నమోదుచేశారని వివరించారు. ఫార్ములా- ఈ రేసు ఒప్పందంలో తప్పిదాలు, అక్రమాలు జరిగాయనేది ఫిర్యాదులోని అంశమని, మొత్తం రూ.54 కోట్ల చెల్లింపుల వ్యవహారంలో ఆర్థికశాఖ అనుమతి పొందలేదన్నది ఫిర్యాదులోని పూర్తి సారాంశమని సుందరం గుర్తుచేశారు. ఇది విధాన నిర్ణయమైనప్పుడు అందులో తప్పిదాలు, అక్రమాలు జరిగితే అందుకు బాధ్యత మంత్రిది కాబోదని, విధాన నిర్ణయానికి పూర్తి బాధ్యత తెలంగాణ ప్రభుత్వానిదే అవుతుందని వాదించారు. విధాన నిర్ణయాల్లో లోటుపాట్లు ఉంటే వాటిని ప్రభుత్వం సరిదిద్దుకోవాలని అన్నారు.

### నిధులు తీసుకున్న సంస్థపై కేసు ఎందుకు లేదు?

నిధులు అందుకున్న సంస్థను నిందితులుగా చేర్చలేదని సుందరం పేర్కొన్నారు. ఫార్ములా-ఈ రేసు నిమిత్తం ప్రభుత్వం, ఫార్ములా-ఈ ఆపరేషన్స్ (ఎఫ్‌ఈవో),ఏస్ నెక్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్ మధ్య ఒప్పందం కుదిరిందని, ప్రమోటర్ వెళ్లిపోవడంతో ప్రభుత్వమే చెల్లింపులు జరిపి రేసు నిర్వహణను ఆమోదం తెలపడం విధాన నిర్ణయంలో భాగమని వివరించారు. నాటి మంత్రిగా ఉన్న పిటిషనర్‌పై కేసు నమోదు చెల్లదని తెలిపారు. వాదనల తర్వాత కేసు ఎఫ్‌ఐఆర్ దశలో ఉన్నందున జోక్యానికి సుప్రీంకోర్టు నిరాకరించడంతో అప్పీల్ పిటిషన్ ఉపసంహకరణకు అనుమతి ఇవ్వాలని సుందరం కోరారు. ఇందుకు అనుమతిస్తూ సుప్రీంకోర్టు తుది ఉత్తర్వులు జారీ చేసింది.

## 430 పేజీల ఎస్‌ఎల్‌పీలో సమగ్ర వివరాలు

నిధుల చెల్లింపులన్నీ బ్యాంకు ద్వారా, అదీ అధికారుల ద్వారా జరిగినప్పుడు అవినీతి ఎలా వర్తిస్తుందని పేర్కొంటూ కేటీఆర్ తరపు న్యాయవాది మోహిత్‌రావు 430 పేజీల స్పెషల్ లీవ్‌పిటిషన్ దాఖలు చేశారు. ఇందులో ఈ నెల 7న హైకోర్టు క్వాష్ పిటిషన్‌ను కొట్టేయడం అన్యాయమని పేర్కొన్నారు. బ్యాంకు ద్వారానే సొమ్ము చెల్లింపు జరిగిందన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సుప్రీంకోర్టును కోరారు. నిబంధనల ఉల్లంఘన నేరం కిందకు రాదని, అదీ క్రిమినల్ అభియోగాల కిందకు ఎలా వస్తుందో అర్థం కావడం లేదని పేర్కొన్నారు. కేటీఆర్‌పై క్రిమినల్ కేసు నమోదు చెల్లదని తెలిపారు. ఒప్పందం కొనసాగింపులో భాగంగా చెల్లింపులు జరిగాయని స్పష్టంచేశారు. ప్రభుత్వం అనేది శాశ్వతమని, గత పాలకులపై కక్ష సాధింపు, వేధింపులతో కేసులు పెట్టడాన్ని తీవ్రంగా పరిగణించాలని కోరారు. ఫార్ములా సీజన్ 9ను పిటిషనర్ మంత్రిగా ఉండగా సమర్థంగా నిర్వహించారని, తర్వాత వచ్చిన ప్రభుత్వం ఫార్ములా రేస్ సీజన్ 10ను నిర్వహించలేదని తెలిపారు. రెండు విడతలుగా ప్రభుత్వం డబ్బులు చెల్లించిన తర్వాత మూడోదైన చివరి విడత చెల్లింపులకు ఆస్కారం ఉన్నప్పటికీ ప్రభుత్వం చేయలేదని వివరించారు. దీంతో సీజన్ 10 నిర్వహించని ప్రభుత్వం ఆ వ్యవహారం నుంచి తప్పించుకునే క్రమంలో పిటిషనర్‌పై తప్పుడు కేసు నమోదు చేసిందని ఆరోపించారు. ఫిర్యాదులోగానీ, ఎఫ్‌ఐఆర్‌లోగానీ పిటిషనర్ కేటీఆర్‌కు ఎలాంటి దురుద్దేశం ఆపాదించలేదని గుర్తుచేశారు. ప్రభుత్వ ఆస్తిని అన్యాక్రాంతం చేయడం లేదా వేరేవారికి అప్పగించడం వంటి విషయాలు ఇందులో లేవని స్పష్టంచేశారు. ఫార్ములా-ఈ నిర్వాహకులను ఎందుకు నిందితులుగా చేర్చలేదని ప్రశ్నించారు. ఒప్పంద అంశాలను సంబంధిత శాఖాధికారులే అమలు చేయాలని, వాటిని మంత్రి చేయరని తెలిపారు. ఫార్ములా-ఈ నిర్వహణకు 2023 సెప్టెంబర్ 27న కుదిరిన ముసాయిదా ఒప్పందంలో హెచ్‌ఎండీఏ ప్రమోటర్‌గా ఉన్నదని దగుర్తుచేశారు. కాబట్టి పిటిషనర్‌పై ఏసీబీ కేసు నమోదు అన్యాయమని పేర్కొన్నారు.

# పిటిషన్ డిస్మిస్ కాలేదు.. వెనక్కి తీసుకున్నాం

- కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై తప్పుడు వార్తలను ఖండిస్తున్నాం
- బీఆర్‌ఎస్ లీగల్ సెల్ ఇన్‌చార్జి సోమా భరత్‌కుమార్ వెల్లడి



హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): ఫార్ములా ఈ కార్ రేసు కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో తాము వేసిన క్వాష్ పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకున్నామని బీఆర్‌ఎస్ లీగల్ సెల్ ఇన్‌చార్జి సోమా భరత్‌కుమార్ చెప్పారు. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేసిందనే వార్తలను ఆయన ఖండించారు. తెలంగాణభవన్‌లో లీగల్‌సెల్ ప్రతినిధులు కల్యాణ్‌రావు, లలితారెడ్డితో కలిసి బుధవారం ఆయన మీడియాతో మాట్లాడారు. సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ వార్తను కొన్ని మీడియా చానెల్స్ వక్రీకరించడం దురదృష్టకరమని మండిపడ్డారు. ప్రతిష్ఠాత్మకమైన ఫార్ములా ఈ-రేస్‌ను హైదరాబాద్ ఇమేజ్ పెంచేందుకు బీఆర్‌ఎస్ హయాంలో నిర్వహించినట్టు చెప్పారు. ఇందులో అవినీతి జరిగిందని కేటీఆర్‌పై ఈ ప్రభుత్వం కేసు నమోదు చేసిందని, చట్టాన్ని గౌరవిస్తూ ఏసీబీ కేసు విచారణకు కేటీఆర్ సహకరిస్తున్నారని తెలిపారు. తమ లీగల్ టీం ఒపీనియన్ ప్రకారం సుప్రీంకోర్టులో బుధవారం కేసును విత్‌డ్రా చేసుకున్నామని, కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కాలేదని స్పష్టంచేశారు. ఈ కేసుకు సంబంధించి ఏ కోర్టులోనైనా అప్పీల్ చేసుకునేందుకు తమకు అవకాశం ఉన్నదని తెలిపారు. కాంగ్రెస్ నేతలు అర్ధసత్యాలు, అబద్ధాలతో ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారని మండిపడ్డారు. నేషనల్ హెరాల్డ్ కేసులో సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ సుప్రీంకోర్టుకు వెళ్లి తమపై ఉన్న ఎఫ్‌ఐఆర్ రద్దుచేయాలని కోరారని, క్వాష్ పిటిషన్‌ను విత్‌డ్రా చేసుకున్నారని గుర్తుచేశారు. వాళ్లు చేస్తే కొట్టేయనట్టు, కేటీఆర్ చేస్తేనేమో కొట్టేసినట్టుగా అవాస్తవాలు ప్రచారం చేయడం తగదని హితవు పలికారు. ప్రజలకు ఉన్న ఏకైక మాధ్యమం మీడియా.. దానిని కూడా కాంగ్రెస్ నేతలు గబ్బుపట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కోర్టు విషయాల్లో కూడా తప్పుడు వార్తలు ప్రసారం చేయడం సరికాదని సూచించారు.

## పిటిషన్‌ను ఉపసంహరించుకున్నాం

### కేటీఆర్ తరపు అడ్వకేట్ మోహిత్‌రావు



హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): సుప్రీంకోర్టులో కేటీఆర్ క్వాష్ పిటిషన్ డిస్మిస్ కాలేదని, లీగల్ ఒపీనియన్ ప్రకారం కేసును విత్‌డ్రా చేసుకున్నామని కేటీఆర్ తరపు న్యాయవాది మోహిత్‌రావు తెలిపారు. ఢిల్లీలో బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ కేసుకు సంబంధించి ఏ కోర్టులోనైనా అప్పీల్ చేసుకునేందుకు అవకాశం తమకు ఉన్నదని తెలిపారు. ఫార్ములా ఈ-కార్ కేసుకు సంబంధించి సుప్రీంకోర్టులో కేటీఆర్ వేసిన పిటిషన్‌పై జస్టిస్ బేలా ఎం త్రివేది, జస్టిస్ ప్రసన్న వర్లే ధర్మాసనం విచారణ జరిపిందని పేర్కొన్నారు. కేటీఆర్ క్వాష్ పిటిషన్‌పై ఆర్యమ సుందరం, సిద్ధార్థ దవేలు వాదనలు వినిపించారని చెప్పారు. ఈ కేసులో సెక్షన్ 13.1A పీసీ యాక్ట్ వర్తించదని వాదనలు వినిపించినట్టు తెలిపారు. ఏసీబీ ఎఫ్‌ఐఆర్‌లో పేర్కొన్న అంశాలు ప్రొసీజర్‌లో ఉన్న ఇర్రెగ్యులారిటీస్‌కి సంబంధించిన అంశాలుగా పేర్కొన్నట్టు వెల్లడించారు.

## నేడు ఈడీ విచారణకు కేటీఆర్

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ) : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ గురువారం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారుల విచారణకు హాజరు కానున్నారు. ఈనెల 7న మరోసారి నోటీసులు ఇచ్చిన ఈడీ అధికారులు.. 16న తమ విచారణకు హాజరుకావాలని కోరారు. దీంతో గురువారం ఉదయం 10 గంటలకు నందినగర్‌లోని తన నివాసం నుంచి బయలుదేరి, 10.30 గంటలకు ఎల్బీ స్టేడియం ఎదురుగా ఉన్న ఈడీ కార్యాలయానికి కేటీఆర్ చేరుకుంటారు.

## సుదీర్ఘ పోరాటాల ఫలితమే పసుపు బోర్డు

- ఫలించిన పసుపు రైతుల చిరకాల వాంఛ
- నాటి ఎంపీ కవిత కృషి అభినందనీయం
- నూతన చైర్మన్ గంగారెడ్డికి శుభాకాంక్షలు
- ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి




హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): సుదీర్ఘ పోరాటాల ఫలితంగానే నిజామాబాద్ కేంద్రంగా పసుపు బోర్డు ఏర్పాటైందని, ఈ ప్రాంత పసుపు రైతుల చిరకాల వాంఛ ఫలించిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తెలిపారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ప్రస్తుత ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత నేతృత్వంలో బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలందరూ అనేకసార్లు ప్రధానికి, కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు ఇచ్చినట్టు తెలిపారు. పసుపు బోర్డు ఏర్పాటు కోసం నాడు కవిత పార్లమెంట్‌లో గళమెత్తారని పేర్కొన్నారు. పసుపు పండించే రాష్ట్రాల సీఎంలతో కేంద్రానికి లేఖలు ఇప్పించడంలో కవిత కృషి చేశారని గుర్తు చేశారు. పసుపుబోర్డు ఎంపికైన చైర్మన్‌గా పల్లె గంగారెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.

### క్వింటాకు 15 వేలు ఇవ్వాలి

పసుపు మద్దతు ధర క్వింటాకు రూ.15,000 చొప్పున ఉండేలా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ తీసుకోవాలని వేముల ప్రశాంత్‌రెడ్డి కోరారు. నిజామాబాద్ సమీప ప్రాంతాల్లో పసుపు ఆధారిత పరిశ్రమలు ఏర్పాటుచేసి స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని కోరారు. బాల్కొండ నియోజకవర్గంలోని వేల్పూరులో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే 42 ఎకరాల్లో టర్మరిక్ స్పైస్ పార్క్ ఏర్పాటు చేసి రోడ్లు, ప్రహరీ పనులను పూర్తి చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు.

## రేవంత్‌రెడ్డివి చిల్లర చేష్టలు

- బీఆర్‌ఎస్ నేతల అరెస్ట్ ఏడో గ్యారెంటీ పథకమా?
- మాజీ మంత్రి ఎర్రబెల్లి



దేవరుప్పుల, జనవరి 15: బీఆర్‌ఎస్ నేతల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీయడానికి సీఎం రేవంత్‌రెడ్డి అరెస్ట్‌ల పేరిట చేస్తున్న చిల్లర చేష్టలను ప్రజలు ఏవగించుకుంటున్నారని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కాంగ్రెస్ ఫిరాయింపు రాజకీయాలను ప్రశ్నించిన బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని అక్రమంగా అరెస్ట్ చేయడం దుర్మార్గమని ఒక ప్రకటనలో ఆరోపించారు. డైవర్షన్ రాజకీయాలు చేస్తున్న రేవంత్‌రెడ్డి బీఆర్‌ఎస్ నేతలను అరెస్ట్ చేయడమే ఏడో గ్యారెంటీ పథకంగా పెట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ప్రతిపక్షాలకు సమాధానం చెప్పడం చేతకాక అణచివేతకు పాల్పడటం అప్రజాస్వామికమని మండిపడ్డారు. పూటకో కేసు, రోజుకో అరెస్ట్ తీరుగా పాలన సాగిస్తున్న రేవంత్ సర్కారు తీరును ప్రజలు ఈసడించుకుంటున్నారని అన్నారు. కౌశిక్‌రెడ్డిపై పెట్టిన అక్రమ కేసులు వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

## బీఆర్‌ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు

- పార్టీలోకి ఆహ్వానించిన మాజీ ఎమ్మెల్యే పట్నం

కొడంగల్, జనవరి 15 : కొడంగల్ నియోజక వర్గంలోని దౌల్తాబాద్‌కు చెందిన దాదాపు 30 మంది కాంగ్రెస్ నాయకులు, రైతులు బీఆర్‌ఎస్‌లో చేరారు. కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి బుధవారం దౌల్తాబాద్‌లో పర్యటించారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇలాకాకు చెందిన కాంగ్రెస్ నాయకులతో పాటు రైతులు స్వచ్ఛందంగా బీఆర్‌ఎస్‌లో చేరగా.. నరేందర్‌రెడ్డి వారికి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కుర్మని మల్కప్ప, గుండెపల్లి భీంరెడ్డి, గోక అశోక్, చెన్నప్ప, నర్సప్ప తదితరులు మాట్లాడుతూ.. ఏడాది కాలంలోనే రేవంత్ పాలనపై విసుగొచ్చిందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని పూర్తి స్థాయిలో అమలు చేయలేదని ఆరోపించారు. కేసీఆర్ పాలనలో రైతులు అన్నింటా లబ్ధిని అందుకోవడంతోపాటు ఆత్మాభిమానంతో వ్యవసాయం చేశారని కొనియాడారు. కాంగ్రెస్ పాలనలో రైతుభరోసా అమలు కాలేదని, రుణమాఫీ అంతంత మాత్రంగానే జరిగిందని పేర్కొన్నారు. ఈ నెల17న చేవేళ్ల నియోజకవర్గంలోని షాబాద్‌లో కేటీఆర్ సమక్షంలో జరిగే మహా ధర్నా కార్యక్రమానికి పెద్దఎత్తున తరలి వెళ్తామని తెలిపారు.

# రేవంత్‌పైనే పీడీ యాక్ట్ పెట్టాలి

మొదటిపేజీ తరువాయి...

చెప్పినట్టే పార్టీ మారిన ఎమ్మెల్యేలను బీఆర్‌ఎస్ కార్యకర్తలు రాళ్లతో కొడతారని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలపై ప్రశ్నిస్తే తనపై పీడీ యాక్ట్ పెట్టి జైల్లో వేయాలని రేవంత్‌రెడ్డి కుట్ర చేశారని మండిపడ్డారు. తెలంగాణ భవన్‌లో బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, లీగల్‌సెల్ ప్రతినిధులు కల్యాణ్‌రావు, లలితారెడ్డితో కలిసి హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కరీంనగర్ జిల్లా సమీక్ష సమావేశంలో జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ తనపై దాడి చేశారని కానీ, తానే దాడి చేసినట్టు కొన్ని మీడియా సంస్థలు తప్పుడు ప్రచారం చేశాయని ఆరోపించారు. ఈ సందర్భంగా ఘటనకు సంబంధించిన వీడియోను మీడియాకు చూపించారు. తన నియోజకవర్గంలో రైతు రుణమాఫీ జరగలేదని, రైతు భరోసా రాలేదని, దళితబంధు ఇస్తలేరని ప్రశ్నిస్తుంటే కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు రన్నింగ్ కామెంట్లు చేశారని గుర్తుచేశారు. ఈ సందర్భంగా ఏ పార్టీ నుంచి మాట్లాడుతున్నావని ఎమ్మెల్యే సంజయ్‌ను ప్రశ్నించినట్టు చెప్పారు. ఈ క్రమంలో తనపై దాడి చేసేందుకు ప్రయత్నించారని వివరించారు. కేసీఆర్ లేకపోతే సంజయ్‌కుమార్ వార్డ్ మెంబర్‌గా కూడా గెలవలేరని అన్నారు.



పోలీసు వాహనంలో తరలిస్తుండగా 'జై తెలంగాణ' నినాదాలు చేస్తున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

### రేవంత్‌పై 89 కేసులు

గతంలో మంత్రిగా ఉన్న డీకే అరుణను టీడీపీలో ఉన్నప్పుడు రేవంత్‌రెడ్డి దూషించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీల అమలు కోసం ప్రశ్నిస్తుంటే తనపై రేవంత్‌రెడ్డి సర్కారు 28 కేసులు పెట్టిందని మండిపడ్డారు. క్రిమినల్ కేసుల్లో రేవంత్‌రెడ్డి నంబర్ వన్ అని, ఆయనపై మొత్తం కేసులు 89 కేసులు ఉన్నాయని విమర్శించారు. అసలు రేవంత్‌రెడ్డిపై పీడీ యాక్టు పెట్టి లోపల నూకాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో జూపల్లి, రేవంత్ మైకు గుంజుకున్నారని, కానీ ఇప్పుడు ఒకే గూటికి చేరారని విమర్శించారు.

### ఎన్ని గుండెలు మీకు?

భువనగిరిలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంపై దాడి ఘటనపై కౌశిక్‌రెడ్డి నిప్పులు చెరిగారు. 'కేసీఆర్ ఫొటోను నేలకేసి కొట్టేందుకు ఎన్నిగుండెలు మీకు? కేసీఆర్ లేకపోతే తెలంగాణ రాష్ట్రం వచ్చేదా? మీకు ఈ పదవులు దక్కేవా? ప్రజలు అంతా గమనిస్తున్నారు. కాంగ్రెస్‌కు బుద్ధి చెప్తారు' అని పేర్కొన్నారు.

## కౌశిక్‌రెడ్డికి మరోసారి నోటీసులు

- నేడు విచారణకు హాజరుకావాలన్న పోలీసులు
- కోర్టు కేసు ఉన్నందున రాలేనన్న ఎమ్మెల్యే

హైదరాబాద్ సిటీబ్యూరో, జనవరి 15 (నమస్తే తెలంగాణ): బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి పోలీసులు మరోసారి నోటీసులు జారీ చేశారు. నేడు విచారణకు హాజరుకావాలంటూ మాసబ్‌ట్యాంక్ పోలీసులు నోటీసులో పేర్కొన్నారు. గత నెల 4వ తేదీన బంజారాహిల్స్ స్టేషన్‌కు ఫిర్యాదు ఇవ్వడానికి వెళ్లిన కౌశిక్‌రెడ్డి ఆ ఠాణా ఇన్‌స్పెక్టర్‌తో దురుసుగా ప్రవర్తించారనే ఆరోపణలపై కేసు నమోదైంది. మరుసటి రోజు కౌశిక్‌రెడ్డిని బంజారాహిల్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఉదయం నుంచి రాత్రి 10.30 గంటల వరకు స్టేషన్‌లోనే నిర్బంధించి, అనంతరం మెజిస్ట్రేట్ ఎదుట ప్రవేశపెట్టారు. న్యాయస్థానం ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. ఇదిలా ఉండగా ఈ కేసు దర్యాప్తు బాధ్యతలను మాసబ్‌ట్యాంక్ ఇన్‌స్పెక్టర్ పరుశురామ్‌కు అప్పగించారు. ఈ కేసు విచారణలో భాగంగా కౌశిక్‌రెడ్డిని ఈ నెల 16వ తేదీన విచారణకు రావాలంటూ రెండు రోజుల క్రితం నోటీసులు జారీ చేశారు. అయితే కోర్టుకు హాజరుకావాల్సి ఉండటంతో మాసబ్‌ట్యాంక్ పోలీసుల విచారణకు హాజరుకాలేనని నోటీసుకు కౌశిక్‌రెడ్డి బదులిచ్చారు.

## కౌశిక్‌రెడ్డికి బెయిల్

- సోమవారం రాత్రంతా స్టేషన్‌లోనే

కరీంనగర్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌ను నిలదీసిన కేసులో ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డికి బెయిల్ మంజూరైంది. సోమవారం రాత్రంతా కరీంనగర్ త్రీ టౌన్ పోలీసు స్టేషన్‌లోనే బంధించిన పోలీసులు, మంగళవారం ఉదయం మెజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. వాదనలు విన్న మెజిస్ట్రేట్ బెయిల్ మంజూరు చేశారు. జగిత్యాల ఎమ్మెల్యే పీఏ వినోద్‌తోపాటు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ సత్తు మల్లయ్య, కరీంనగర్ ఆర్డీవో మహేశ్ ఫిర్యాదు చేశారు. హైదరాబాద్‌లో కౌశిక్‌రెడ్డిని అరెస్టు చేసిన పోలీసుల రాత్రి 9 గంటలకు కరీంనగర్‌కు తరలించారు. స్టేషన్ బెయిల్ కోసం బీఆర్‌ఎస్ నాయకులు, న్యాయవాదులు సర్దార్ రవీందర్‌సింగ్, నారదాసు లక్ష్మణ్‌రావు పోలీసులను సంప్రదించినా ఫలితం లేకుండాపోయింది. తర్వాతి రోజు ఉదయం ప్రముఖ న్యాయవాదులు మధుసూదన్‌రావు, సర్దార్ రవీందర్‌సింగ్ వాదనలతో ఏకీభవించిన మెజిస్ట్రేట్ రెండు కేసుల్లో బెయిల్ మంజూరు చేశారు. ఈ నెల 16న రూ.2 లక్షల ష్యూరిటీలు అందించాలని ఆదేశించారు. కాగా, కౌశిక్ అరెస్టుతో కరీంనగర్ జిల్లాలో ఉద్రిక్తత నెలకొన్నది. బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు ఎక్కడికక్కడ అరెస్టు చేశారు.



నియామక పత్రాన్ని శ్రీనివాస్‌గౌడ్‌కు అందజేస్తున్న ప్రతినిధులు

## గోవా రాష్ట్ర ఓబీసీ చీఫ్ అడ్వయిజర్‌గా శ్రీనివాస్‌గౌడ్

హైదరాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ): రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్-గోవా చీఫ్ అడ్వయిజర్‌గా మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ నియమితులయ్యారు. గోవాలోని ఓ హోటల్‌లో రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సమావేశానికి శ్రీనివాస్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా గోవా చీఫ్ అడ్వయిజర్‌గా శ్రీనివాస్‌గౌడ్‌ను ఎన్నుకున్నారు. తెలంగాణలో మాదిరిగా గోవాలో కూడా ఓబీసీల సంక్షేమ పథకాల అమలుకు కృషి చేయాలని వివిధ సంఘాలు ఆయనకు విజ్ఞప్తి చేశాయి. అనంతరం శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం జనగణనతోపాటు కులగణన చేసి, జనాభా ప్రాతిపదికన ఓబీసీ రిజర్వేషన్లను కల్పించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ తరహా గోవాలో మహాత్మా జ్యోతిబాపూలే రెసిడెన్షియల్ స్కూళ్లు, కళాశాలలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్రీయ ఓబీసీ మహాసంఘ్ గోవా రాష్ట్ర అధ్యక్షుడు మధు అనంత్‌నాయక్, వైస్ ప్రెసిడెంట్ నోను నాయక్, ఫిషరీస్ కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షుడు పద్మనాభ అమోడ్కర్, నాభిక్ సమాజ్ సెక్రటరీ లాడ్సులాకర్ పాల్గొన్నారు.

## రైతులను దగా చేసిన కాంగ్రెస్

- జోగు రామన్న ఆధ్వర్యంలో జాతీయ రహదారిపై రాస్తారోకో

ఆదిలాబాద్, జనవరి 15 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేస్తున్నదని మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. రైతుభరోసా కింద ఎకరాకు రూ.15 వేలు, రూ.2 లక్షల రుణమాఫీ అర్హులందరికీ అందించాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఆదిలాబాద్ జిల్లా బేల మండలం కేంద్రంలోని జాతీయ రహదారి-353(బీ)పై బీఆర్‌ఎస్ నాయకులు, రైతులతో కలిసి జోగు రామన్న రాస్తారోకో నిర్వహించారు. రోడ్డుపై బైఠాయించిన రైతులు, బీఆర్‌ఎస్ నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా జోగు రామన్న మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే రెండు విడతల రైతు భరోసా ఎగ్గొట్టిందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఎకరాకు రూ.15 వేలు ప్రకటించి ఇప్పుడు రూ.12 వేలే ఇస్తామనడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. ఆత్మీయ భరోసా పథకంలో భాగంగా వ్యవసాయ కూలీలకు రూ.12 వేలు ఇస్తామని ప్రకటించి, ఉపాధి హామీ పనులు చేసే కూలీలు 2023-24 సంవత్సరంలో 20 రోజులు పని చేసి ఉండాలనే నిబంధన విధించడం కూడా మోసమేనని ఆయన మండిపడ్డారు.



ఆదిలాబాద్-బేల జాతీయ రహదారిపై బైఠాయించిన బీఆర్‌ఎస్ నాయకులు, రైతులు